

దేశంలో అన్ని హిందూ వివాహాలు జాతకాల ప్రకారం నిర్ణయమవుతాయి. వధూవరుల జాతకాలు కుదిరిన (మ్యాచింగ్ అయిన) వెంటనే వివాహ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. తెలుగు వారు కూడా ఈ పద్ధతి ప్రకారమే వివాహ కార్యక్రమాలను ప్రారంభిస్తారు. జాతకాలు కుదిరిన వెంటనే ఆయా కుటుంబాలు పెళ్ళికి సమాయత్తమవుతాయి. వివాహానికి ముందు నిశ్చయ తాంబూలం కార్యక్రమం జరుగుతుంది. దీనినే నిశ్చితార్థం అని కూడా పేర్కొంటారు. ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంనాడు పెళ్ళికొడుకు  పెళ్ళికూతురు ఇంటికి బంధుమిత్ర సపరివారంగా వస్తారు. (ప్రస్తుతం ఆయా కుటుంబాల ఇష్టానుసారం ఈ కార్యక్రమం ఫంక్షన్ హాల్స్‌లో లేదా హోటళ్ళ కాన్ఫరెన్స్ హాల్స్‌లో కూడా జరుపుతున్నారు.) ఈ సందర్భంగా పెళ్ళికొడుకు తరఫువారు పండ్లు, నగలు, చీరను పెళ్ళి కూతురుకు బహూకరిస్తారు. వారు ఇచ్చిన చీరను పెళ్ళికూతురు ధరిస్తుంది. ఈ పద్ధతి ఉత్తరాదిలో కూడా కనిపిస్తుంది. ఈ కార్యక్రమంలోనే వరునికి కూడా పెళ్ళికూతురు తరఫువాళ్ళు ఖరీదైన బహుమతులను, దుస్తులను అందజేస్తారు. నిశ్చితార్థం కార్యక్రమంలో ఉభయపక్షాల పెద్దలు కూర్చుని పెళ్ళి జరిగే రోజును నిర్ణయిస్తారు. తమ పురోహితుని సలహా ప్రకారం వివాహం జరిగే రోజును, ముహూర్తాన్ని నిర్ణయించి లగ్నపత్రిక రాసుకుంటారు. ఆషాఢ, భాద్రపదం వంటి శూన్య మాసాల్లో తప్ప మిగిలిన నెలల్లో వివాహం జరపడం తెలుగువారి పద్ధతి. ఆ నెలల్లో పెళ్ళి జరపడం శుభప్రదంకాదని వారి నమ్మకం.

వివాహానికి ముందు ఒక మంచి రోజు చూసి రెండు కుటుంబాల ఇళ్ళల్లో వధువుకు, వరునికి మంగళ స్నానం చేయిస్తారు. తరువాత అబ్బాయిని పెళ్ళి కొడుకును, అమ్మాయిని పెళ్ళికూతురును చేసి ఆశీర్వదిస్తారు. మంగళస్నానానంతరం పెళ్ళికూతురును పూలు, నగలు, జరీచీర, నుదుట పెళ్ళిబొట్టుతో ముస్తాబు చేస్తారు. వారి వారి ఇళ్ళలో కుటుంబ సభ్యులు వధూవరులకు మంగళహారతి ఇచ్చి ఆశీర్వదిస్తారు. వధూవరులు కలకాలం తమ కాపురాన్ని చక్కగా సాగించాలని ఆకాంక్షిస్తూ కుటుంబ పెద్దలు వారిని ఆశీర్వదిస్తారు. ఇక పెళ్ళిరోజున వధువు గౌరీపూజ చేస్తుంది. శక్తిస్వరూపిణి అయిన గౌరీదేవిని పూజిస్తే అమ్మవారి అనుగ్రహంతో తమకు కూడా సంతానం కలిగి సకల సౌఖ్యాలతో విలసిల్లుతామని నమ్మకం. ఆ శక్తిస్వరూపిణి అయిన గౌరీమాత కరుణాకటాక్షాల కోసం వధువు ఈ పూజ చేస్తుంది.

వరునికి అంతకుముందే ఉపనయనం కాకపోయి ఉంటే పెళ్ళికి ముందురోజు ఆ కార్యక్రమం జరిపి తరువాత స్నాతకం నిర్వహిస్తారు. ఈ స్నాతకం కార్య

**...తరువాయి 11,12వ పేజీలలో**